సాక్షి విజయనగరం

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



పాపం పశువులు..!

పార్వతీపురం మన్యం జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు గోవుల తరలింపు జరుగుతోంది.

- 8లో



నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ

- 8లో

నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు.

కొండలక్ష్మీపురం వద్ద రైల్వే బ్రిడ్జి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కొండలక్ష్మీపురం రైల్వే గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని పలు రైల్వేగేటుల వద్ద రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. ఇందులో భాగంగా కొండలక్ష్మీపురం రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే ఉన్నతాధికారులు జీఓ విడుదల చేశారు. ఈ ప్రాంత వాసులకు రైల్వే గేటు కష్టాలు తొలగనున్నాయి.

న్యూస్‌రీల్

ఘనంగా ఉరుసు ఉత్సవం



దరియాఖాన్ బాబా దర్గాలో ప్రత్యేకప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: స్థానిక కోట్లమాదప్పవీధిలో కొలువైన హజరత్ సయ్యద్ దరియాఖాన్ బాబా అవులియా ఉరుసు మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతాలకతీతంగా దర్గా ఆవరణలో మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. దరియాఖాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సిద్దిక్, షేక్ బాబా, అజీమ్ అన్వర్ జానీలు మాట్లాడుతూ సయ్యద్ బాబాల దర్గా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

చెరకు రైతులకు సౌకర్యాలు కల్పించండి



కర్మాగారంలో రైతుల విశ్రాంతి భవనాన్ని పరిశీలిస్తున్న ఉప కమిషనర్ జీవీవీ సత్యనారాయణ

రేగిడి: స్థానిక ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి చెరకును తరలిస్తున్న రైతులు, డ్రైవర్లకు సదుపాయాలు కల్పించాలని సుగర్ కేన్ ఉప కమిషనర్ జీవీవీ సత్యనారాయణ యాజమాన్యానికి సూచించారు. చక్కెర కర్మాగారం పరిసరాలను ఆయన గురువారం పరిశీలించారు. అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు ఇటీవల ఇక్కడ రైతులకు సౌకర్యంలేదని ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఉప కమిషనర్ కర్మాగారం పరిసరాలు పరిశీలించారు. గతంలో రైతులకోసం నిర్మించిన విశ్రాంతి భవనం పరిశీలించి, వినియోగంలోకి తీసుకురావాలని యాజమాన్యానికి సూచించారు. మరుగుదొడ్లు, సాగునీరు తదితర వాటిని వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

20 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు



ఆర్టీసీ సంస్థ జిల్లా రవాణా అధికారి అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను డోర్ డెలివరీ స్థాయికి వివరించే లా ఈ నెల 20వ తేదీ నుంచి జిల్లాలో మాసోత్సవాలను నిర్వహిస్తామని ఆర్టీసీ సంస్థ జిల్లా రవాణా అధికారి సీహెచ్ అప్పలనాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 90 పట్టణ కేంద్రాల్లో తొలి విడతగా ఈ సేవలను విస్తరిస్తున్నారని, అందులో విజయనగరం పట్ట ణం ఉందని తెలిపారు. సమీప బుకింగ్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల వరకు 50 కిలోల బరువు గల పార్శిళ్లను ఇంటికే తెచ్చి అందజేస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సురగాల లక్ష్మణ్



ఎస్ఈ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సురగాల లక్ష్మణ్ అన్నారు. చండీగడ్‌లో విద్యుత్ సంస్థల ప్రతిపాదిత ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో దాసన్నపేట విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగడ్ తర్వాత ఏపీలో కూడా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని ఆరోపించారు. దీనిని విద్యుత్ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నా అనంతరం ఎస్ఈ మువ్వల లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ కన్వీనర్ బండారురాజేష్, ఉపాధ్యక్షుడు పి.అప్పలస్వామినాయుడు, బి.కె.వి.ప్రసాద్‌రావు, సీతారామరాజు, ఎల్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గంజాయిపై పోలీస్ పంజా



- అడుగడుగునా నిఘా
- ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు
- గంజాయి రవాణా చేసే మూలాలపై దృష్టి సారిస్తున్న పోలీస్ శాఖ
- ఇప్పటి వరకు 2,200 కిలోల గంజాయి స్వాధీనం, 270 మంది అరెస్ట్, 53కి పైగా వాహనాలు సీజ్
- ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు: ఎస్పీ వకుల్‌జిందాల్

గంజాయి తరలింపు రూట్‌లు ఇలా...

- పెదబయలు, మంగబంద, గుంటసీమ, దబ్రిగుడ, అరకు మీదుగా అనంతగిరి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస మీదుగా విశాఖపట్నం
- కొటారుబిల్లి జంక్షన్, గంట్యాడ మీదుగా విజయనగరం
- ఒడిశాలో కోరాపుట్ నుంచి బరంపురం, సాలూరు మీదుగా విజయనగరం
- రాయగడ మీదుగా పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, విజయనగరం మీదుగా విశాఖపట్నం

విజయనగరం టౌన్:

విజయనగరం... అటు ఒడిశా సరిహద్దుగా ఉన్న పార్వతీపురం మన్యం.. ఇటు విశాఖపట్నం ఏజెన్సీతో సరిహద్దు ఉన్న జిల్లా. ఈ అవకాశాన్ని గంజాయి వ్యాపారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. మన్యం దారులను గంజాయికి ప్రధాన మార్గంగా వినియోగిస్తున్నారు. వివిధ కూడళ్లతో అనుబంధం ఉన్న విజయనగరం రైల్వేస్టేషన్‌కు, జాతీయ రహదారులకు గంజాయిని చేర్చి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇటీవల జిల్లాలో కూడా విక్రయాలకు తెరతీశారు. గంజాయి రవాణాతో పాటు అమ్మకాలను పెంచారు. ప్రధాన కూడళ్ల వద్ద చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో యువతకు విక్రయించి గంజాయికి బానిసలను చేస్తున్నారు. గొడవలు సృష్టిస్తున్నారు. ఈ విషసంస్కృతి పట్టణానికి అనుసరించి ఉన్న పల్లెలు, కళాశాలలకు చేరింది. ఈ వ్యవహారం మాఫియాగా మారే అవకాశం ఉండడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేక శ్రద్ధతో గంజాయి రవాణా, అమ్మకాల నియంత్రణకు పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటుచేశారు. 24 గంటల పాటు నిఘావేసి గంజాయి వ్యాపారానికి చెక్‌పెట్టేలా కొందరు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేయడంపై దృష్టిసారించారు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తుండడంతో గంజాయితో పట్టుబడుతున్నవారి సంఖ్య పెరిగింది. ఇటీవల కాలంలో రూ.54.66లక్షల విలువైన 2,200 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 270 మందిని అరెస్టు చేయడంతో పాటు 53కిపైగా వాహనాలను సీజ్ చేశారు. రూ.14,400 విలువైన 78 గ్రాముల నల్లమందును సైతం సీజ్ చేశారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు కాల్‌చేయాలని సూచిస్తున్నారు. ప్రధానంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు సంకల్పం కార్యక్రమం పేరుతో అవగాహన కల్పిస్తున్నారు.



కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న 810 కిలోల గంజాయి


- డిసెంబర్ 13న రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక లారీ, రెండు బొలేరో వాహనాల్లో ఒడిశా రాష్ట్రం నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.40.50 లక్షల విలువ కలిగిన 810 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 450 కిలోల గంజాయి కొత్తవలసలో స్వాధీనం చేసుకున్నారు.
- విజయనగరం వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ఇద్దరు యువకులను ఉడాకాలనీలో పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండుకిలోల గంజాయిని సీజ్ చేశారు. ఈ నెల 9న తోటపాలెం శ్మశానవాటిక సమీపంలో బొగ్గులదిబ్బకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కేసుల నమోదు ఇలా....

ఏడాది	బుక్ అయిన కేసులు	అరెస్ట్ అయిన వారి సంఖ్య	సీజ్ చేసిన గంజాయి
2016	16	42	1522 కేజీల 705 గ్రా..
2017	23	63	4,019 కేజీల 935 గ్రా.
2018	07	21	2,024 కేజీల 60 గ్రా
2019	35	69	6,231 కేజీల 301 గ్రా.
2020	35	79	6,209 కేజీల 730 గ్రా.
2021	32	73	9,687 కేజీల 378 గ్రా.
2022	51	100	3,181 కేజీల.055 గ్రా.
2023	58	105	2,558 కేజీల 055 గ్రా.
2024	76 (ఇప్పటి వరకు)	270	2,200 కేజీల 815 గ్రా.



ఉపేక్షించేది లేదు



నిషేధిత గంజాయి రవాణా చేసేవారెవ్వరైనా ఉపేక్షించేదిలేదు. గంజాయి రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం. గత ఐదు నెలల్లో 200 మందికిపైబడి నిందితులను అదుపులోకి తీసుకున్నాం. ఒకరిపైన పీడీ యాక్ట్ నమోదుచేశాం. అదే పనిగా గంజాయి తరలించేవారిపైనా పీడీయాక్ట్ నమోదు చేస్తాం. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. గంజాయి రవాణా చేసేవారిని ఏరివేయడానికి ప్రత్యేక టీమ్ పనిచేస్తోంది. జిల్లాలో ఐదు చెక్‌పోస్టులు నడుస్తున్నాయి. ప్రతిరోజూ పదిచోట్ల వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ప్రదేశాల్లో వాహన తనిఖీలు చేపడుతున్నాం. సంకల్పం పేరుతో యువత కు అవగాహన కల్పిస్తున్నాం.

– వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

కార్లలో గంజాయి తరలింపు.. నలుగురి అరెస్టు

- రెండు కార్లును సీజ్ చేసిన పోలీసులు
- 18 కిలోల గంజాయి స్వాధీనం



కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు



పోలీసులు సీజ్‌చేసిన రెండు కార్లు

తెర్లాం:

అక్రమంగా రెండు కార్లలో 18 కిలోల గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. తెర్లాం కూడలి వద్ద గల వాటర్ ట్యాంక్ సమీపంలో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు తన సిబ్బందితో వాహన తనిఖీలు చేశారు. అదే సమయంలో రామభద్రపురం నుంచి రాజాం వైపు రెండు కార్లలో వస్తున్నవారు పోలీసులను చూసి మళ్లీ రామభద్రపురం వైపు పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ, సిబ్బంది వాటిని వెంబడించి రెండు కార్లను పట్టుకున్నారు. వాటిని తనిఖీ చేస్తే 18 కిలోల గంజాయి బయటపడింది. వాటిలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక కారులో ప్రయాణిస్తున్న కొరాపుట్‌కు చెందిన ఇద్దరిలో ఒకరు మైనర్ కాగా, మరొకరు చందన్‌ఘుడియాగా గుర్తించాం. 18 కిలోల గంజాయిని 15 ప్యాకెట్లుగా తయారు చేసి కారు వెనుక భాగంలో ఉంచారు. ఈ కారు కొరాపుట్ నుంచి పాచిపెంట మీదుగా ఓ తోటలోకి వచ్చింది. అక్కడ అప్పటికే ఉన్న మరొక కారులోకి 10 కిలోల గంజాయి ప్యాకెట్లను వేరు చేసి పెట్టారు. ఈ కారు హర్యానా రాష్ట్రానికి చెందినదిగా గుర్తించాం. అందులో వీరేంద్రసింగ్, సునీల్‌రాణా ఉన్నారు. గంజాయిని హర్యానాలోని ఓ వ్యక్తికి ఇచ్చేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడ్డారు. నలుగురు వ్యక్తులను బొబ్బిలి ఏజెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చాం. వాహనాలను సీజ్‌చేశాం. గంజాయి విలువ రూ.90వేలు ఉంటుంది. సమావేశంలో సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పాఠశాలలో అసభ్యకర బోధన!

- ఉపాధ్యాయురాలిపైనా వేధింపులు
- అలస్యంగా వెలుగులోకి వచ్చిన ఉపాధ్యాయుల కీచక బుద్ధి
- పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతున్న చిన్నారులు
- టీసీలు ఇచ్చేయమని పాఠశాలను ఆశ్రయించిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు
- డీఈఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు




వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాల

కొత్తవలస:

విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొందరు గురువులు కీచక బుద్ధిని ప్రదర్శిస్తున్నారు. చదువుల నిలయంలో బాలబాలికలకు అసభ్యకర అంశాలను బోధిస్తున్నారు. చదువుకు సంబంధం లేని ప్రశ్నలతో తప్పుదోవపట్టిస్తున్నారు. చివరకు మహిళా ఉపాధ్యాయురాలిపైనా వేధింపులకు దిగారు. ఆమె నేరుగా డీఈఓకు ఫిర్యాదు చేశారు కూడా. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస మండలం వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు 99 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి బోధించేందుకు ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ ఏడు, ఎనిమిది తరగతులకు చెందిన బాలికలు వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరు పిల్లల తల్లిదండ్రులు టీసీలు ఇవ్వాలంటూ పాఠశాలకు వెళ్లినట్టు సమాచారం. ఓ దశలో ఎక్కువగా వేధిస్తున్న కీచక ఉపాధ్యాయుడికి బుద్ధిచెప్పేందుకు కూడా సిద్ధమయ్యారు. ఆయన ఈ నెల 3 నుంచి సెలవుపెట్టడంతో సాధ్యంకాలేదన్నది సమాచారం. ఆధునిక పద్ధతుల్లో బోధించేందుకు ప్రభుత్వం సమకూర్చిన పరికరాలను వక్రబుద్ధితో అసభ్యకర బోధనకు వినియోగిస్తున్నట్టు తెలిసింది. కళలోకి యువరాజు వస్తున్నాడా? ఆడపిల్ల నడుము శంఖంలా ఉండాలి.. కళ్లు.. చేపకళ్లలా ఉండాలి.. ఎంత మంది పుష్పవతి అయ్యారు వంటి ప్రశ్నలు కీచక ఉపాధ్యాయుడి నుంచి తరచూ బాలికలకు ఎదురవుతుండడంతో కొందరు పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. మగపిల్లలకు బూతు బొమ్మలు, చిత్రాలను నేరుగా సెల్‌ఫోన్‌లో చూపడం, ఉపాధ్యాయుడికి చెందిన లవ్‌స్టోరీలు చెప్పడం వంటి వికృత చేష్టలు చేస్తున్నట్టు తెలిసింది.

ఉపాధ్యాయినిపై వేధింపులు..

ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఓ మహిళా ఉపాధ్యాయినికీ ఆ ఉపాధ్యాయుల నుంచి వేధింపులు తప్పలేదు. అసభ్యకర ప్రవర్త, వికృత చేష్టలు, కులంపేరుతో అవమాన పర్చుతున్నారంటూ ఆమె నేరుగా పాఠశాల హెచ్‌ఎం, మరో ఇద్దరు ఉపాధ్యాయులపై అక్టోబర్ 30వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ జరిపారే తప్ప చర్యలు తీసుకోలేదన్నది ఆరోపణ. తాజాగా విద్యార్థులకు అసభ్యకర బోధన ఘటనపై విచారణకు డీఈఓ యు.మాణిక్యంనాయుడు వారం రోజుల కిందట డిప్యూటీ డీఈఓ రమణ, మండల విద్యాశాఖ అధికారి-2 బండారు శ్రీనివాసరావును నియమించినట్టు తెలిసింది. వారు పలుసార్లు పాఠశాలను సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.



డీఈఓకు అక్టోబర్ 30వ తేదీన ఉపాధ్యాయిని చేసిన ఫిర్యాదు కాపీ

క్షయ రహిత జిల్లాయే లక్ష్యం

- కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: క్షయ రహిత జిల్లాయే లక్ష్యంగా వంద రోజుల క్షయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 10 వాహనాల ద్వారా క్షయ పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 779 క్షయ వ్యాధి నిర్ధారణ, వైద్యపరీక్షల శిబిరాలు నిర్వహించినట్టు వెల్లడించారు. క్షయవ్యాధి ప్రచార, నిర్మూలనా కార్యక్రమంపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలీలా శ్రీవాత్సవ, అడిషనల్ సెక్రటరీ ఆరాధనా పట్నాయక్, టీబీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఊర్వశి బిసింగ్, టీబీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్‌రావ్‌లు గురువారం జాతీయ స్థాయి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో చేపట్టిన క్షయ నివారణ చర్యలను వివరించారు. క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

పారిశుద్ధ్య కార్మికులకు ష్యూరిటీలేని రుణాలు



పారిశుద్ధ్య కార్మికుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా

విజయనగరం అర్బన్: సఫాయి కర్మచారి (పారిశుద్ధ్య కార్మికులు)లకు ష్యూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారిలకు విధిగా పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అందుతున్న పథకాలు, సామాజిక, విద్యా, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. కార్మికులు చనిపోయిన వెంటనే కారుణ్య నియామకాల కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమైన దుస్తులు, బూట్లు, చేతి గ్లౌవ్స్, నూనె తదితర సామగ్రిని అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆదాయాలకు అతీతంగా కార్మికులకు ప్రభుత్వం ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అదనపు ఎస్పీ సౌమ్యలత, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామానందం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డీఈఓ యూ.మాణిక్యంనాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, విజయనగరం, రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, అప్పలనాయుడు, రామలక్ష్మి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ క్యాంపస్

స్వచ్ఛ క్యాంపస్‌లో భాగంగా విజయనగరం కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో ప్లాస్టిక్, బయోడీగ్రేడబుల్ వ్యర్థాలను గురువారం ఏరివేశారు. ఈ బృహత్తర ప్రక్రియలో వీసీ కట్టిమణితో పాటు ప్రొఫెసర్లు, విద్యార్థులు భాగస్వాములయ్యారు. సేకరించిన వ్యర్థాలను విజయనగరం మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ శుభ్రత, సుస్థిర పర్యావరణానికి ప్రతి విద్యార్థి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. వివిధ పరిశుభ్రత డ్రైవ్‌లలో చురుగ్గా పాల్గొన్న టీచింగ్, నాన్ టీచింగ్ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమం కంప్యూటర్స్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ బొంతు కోటయ్య ఆధ్వర్యంలో సాగింది.

– విజయనగరం అర్బన్





క్లుప్తంగా

భామిని సమీపంలోకి ఏనుగుల గుంపు



భామిని నదీతీరంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు

భామిని: మండల కేంద్రంలోకి గురువారం కొత్త సమస్య వచ్చి పడింది. భామిని నదీతీరంలోకి నాలుగు ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఇంతవరకు పసుకుడి తీరంలో ఉన్న ఏనుగుల గుంపు భామిని వైపు నడిచింది. తీరం వెంబడి ఏనుగుల గుంపు నడిచిందని పంటలు వేసిన రైతులు తెలిపారు.మండల కేంద్రంలోకి ఏనుగుల గుంపు చేరి పంటలను నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పదోతరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ విడుదల



పదోతరగతి పరీక్షకు మోడల్ టెస్ట్ పేపర్స్‌ను విడుదల చేసిన డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల ప్రిపరేషన్ కోసం ఉపాధ్యాయులు రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను డీఈఓ యు.మాణిక్యం నాయుడు తన చాంబర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అధికమార్కుల సాధన కోసం ఉపాధ్యాయులు శ్రద్ధ చూపి స్వయంగా రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వా టిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోడల్ టెస్ట్ పేపర్ల సెట్‌లో ఏడు సబ్జెక్టుల నుంచి తయారు చేసినవని పేపర్ల రూపకర్తలు వివరించారు. ప్రతి సబ్జెక్టుకు నాలుగు మోడల్ పేపర్లు జవాబులతో కూడి ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కేవీరమణ, అడిషనల్ డైరెక్టర్ బేత గౌరీశంకర్, సూపరింటెండెంట్ బాల భాస్కర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, జేఏవీ ఆర్ కే ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సీహెచ్‌తిరుపతి నాయుడు, ఎ.శంకరరావు, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వాసుదేవరావు, జి.రమణ, వీ.శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి రామారావు



తంగుడుబిల్లిలో రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

నెల్లిమర్ల రూరల్: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుసున్న నేపథ్యంలో వరి రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు 1600 టార్పాలిన్లను కొనుగోలు చేశామన్నారు. నెల్లిమర్ల మండలానికి 32 పరదాలు పంపిణీ చేశామని చెప్పారు. నూర్పు చేసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే సమీప ఆర్‌ఎస్‌కేల్లో తిరిగి అప్పగించాలని సూచించారు. వర్షాలు పడుతుండంతో కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

విజయనగరం వేదికగా విజయ్ హజారే ట్రోఫీ

విజయనగరం: క్రీడలకు పుట్టినిల్లు విజయనగరం వేదికగా విజయ్ హజారే క్రికెట్ ట్రోఫీ జరగనుంది. నగర శివారుల్లో గల విజ్జీ స్టేడియంతో పాటు డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 21 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు మ్యాచ్‌ల నిర్వహణకు ఏసీఏ, వీడీసీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టోర్నీలో భాగంగా గ్రూప్–డి మ్యాచ్‌లలో చండీగఢ్, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్, విదర్భ, మిజోరం జట్లు తలపడనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹123	₹216	₹226

పాపం పశువులు..!



పార్వతీపురం సంతలో పశువులు

- జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు తరలింపు
- పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా వ్యవహారం
- జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు కూడా..
- జిల్లాలో నాలుగు పశువుల పికప్ పాయింట్లు
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న వ్యాపారస్తులు
- పట్టించుకోని పశుసంవర్ధక శాఖాధికారులు
- ప్రతి వారం 4వేలనుంచి 5వేల వరకు పశువుల అక్రమ రవాణా

పార్వతీపురం టౌన్: జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు గోవుల తరలింపు జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఈ వ్యవహారం నడుస్తున్నప్పటికీ పైస్థాయి అధికారులు ఈ విషయం పట్టించుకోపోవడంతో కిందిస్థాయిలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై వ్యాపారులు దీన్ని ఆదాయమార్గంగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో చూస్తున్న వారంతా పాపం పశువులు అంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రతి గురువారం పశువుల సంత జరుగుతుంది. పట్టణ శివారున ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ సంత దశాబ్దాల నుంచి జరుగుతోంది. ఈ సంతలో ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నపోతులు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు చేస్తుంటారు. సర్వసాధారణంగా పశువుల సంత అనగానే..రైతులు గుర్తుకొస్తారు. తమ అవసరాలకు ప్రాణాతి ప్రాణంగా పెంచుకున్న మూగ జీవాలను విక్రయిస్తుంటారు. జీవన భృతి కోసం..సాగు కోసం..మరి కొందరు రైతులు ఆదే మూగ జీవాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా వేలాదిమంది రైతులు..ప్రతి గురువారం నిర్వహించే పార్వతీపురం సంతకు విచ్చేస్తుంటారు. ఇదే అదునుగా కొందరు పశువుల వ్యాపారులు ప్రతివారం సుమారు 4వేలనుంచి 5వేల వరకు పశువులను అక్రమంగా రవాణా, కొనుగోలు చేస్తూ, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రతివారం లక్షల్లో వ్యాపారం చేస్తూ..వేలాది పశువులు కబేళాకు తరలిస్తున్నారు.

పశువుల సంతల్లోనే..

జిల్లాకేంద్రం కేంద్రంగా పశువుల సంత నడుస్తోంది ఇక్కడ గేదెలు, ఆవులు, దున్నపోతుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఒడిశా సరిహద్దు గ్రామాలు, కొమరాడ, జియమ్మవలస, కురుపాం, గరుగుబిల్లి, బొబ్బిలి, సాలూరు నుంచి ఈ సంతకు పశువులను అమ్మకాలకు తీసుకొస్తుంటారు. ఇక్కడ గతంలో గురువారం ఒక రోజే సంత నిర్వహించేవారు. సంతలో పశువుల అమ్మకాలు జరపాలంటే ముందుగా పశువైద్యాధికారులు పరిశీలించాలి. ఈ సంత నిర్వహణకు ఏఎంసీ అనుమతి తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా మూగ జీవాలను అక్రమంగా తరలిస్తున్నారు.

నిబంధనలు గాలికి

మూగజీవాల అక్రమ తరలింపును అడ్డుకోడానికి కేంద్రప్రభుత్వం జంతు సంరక్షణ చట్టం–1960, గో సంరక్షణ చట్టం–1977లను రూపొందించింది. ఈ చట్టాలను అనుసరించి, పశువులను తరలించే వాహనాలు రవాణాశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. గొర్రెలను, మేకలను 0.3 స్క్వేర్ మీటర్లలో, పెద్ద జంతువులను 2 స్క్వేర్ మీటర్ల స్థలం ఉండే వాహనాల్లోనే తరలించాలి. ఆరోగ్యం బాగోలేని పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించకూడదు. తరలింపులో పశువుల వయస్సు, వాటి బరువును కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పెద్ద జంతువుల పక్కన చిన్న జంతువులను పెట్టరాదు. పశువుల తరలింపులో స్థానిక పశు వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. వాహనాల్లో పశువులకు సరిపడా ఆహారం, నీడ, నీరు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రవాణాలో గాయపడే పశువులకు ప్రాథమిక వైద్యమందించే అనుభవమున్న వ్యక్తి కూడా ఆయా వాహనాల్లో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలేవీ పార్వతీపురం కేంద్రం నుంచి పశువులను తరలించే వాహనాల్లో వ్యాపారులు పాటించడం లేదని జంతు ప్రేమికులు మండిపడుతున్నారు.

పశువులకు గాయాలు..

పెద్ద కొమ్ముల కలిగిన గేదెల వల్ల పక్కనున్న గేదెలు తీవ్ర గాయలపాలవుతుంటాయి. ఒకదాని పక్కన ఇంకోటి పెట్టడం వల్ల తొక్కిసలాటలో చిన్న జంతువుల కాళ్లు విరిగిపోవడం, శరీరం గాయలపాలవడం జరుగుతోంది. గాయాలైన పశువులకు ప్రాథమిక వైద్యం సైతం అందించే పరిస్థితి లేదు. ఇక్కడి సంతలో కొనుగోలు చేసిన పశువులను విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, తమిళనాడు, కేరళకు తరలిస్తుంటారు. ఇలా వందల కిలో మీటర్ల మేర పశువులను ఎటువంటి సౌకర్యాలూ లేకుండా తీసుకెళ్లుంటారు. మేతగాని, నీరుగాని లేకుండా మూడు నాలుగు రోజుల పాటు పశువులు ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. ఏ భంగిమలో ఉంటే అదే భంగిమలో పశువులను నాలుగు రోజుల అలాగే ఉంచి తీసుకువెళ్తారు.

చట్టాల్లో లొసుగులే వ్యాపారులకు కాసులు

పశువుల అక్రమ రవాణాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు రూపొందిస్తూనే ఉన్నాయి. ఎన్ని చట్టాలున్నా పశువుల అక్రమ రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఇందుకు అందేలో ఉన్న లొసుగులే కారణం. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షించడానికి ప్రతి జిల్లాలో గోశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగిలిన జిల్లాల సంగతేమోగాని, జిల్లాలో ఎక్కడా గోశాల లేదు. దీనివల్ల సీజ్ చేసిన వాహనాల్లోని పశువుల సంరక్షణ భారంగా మారుతోంది. దీంతో పట్టుబడిన వాహనాలపై జరిమానా విధించి, పోలీసులు విడిచిపెడుతున్నట్లు సమాచారం. ఇదే వ్యాపారులకు వరంగా మారింది. ఫైన్ కడితే సరి..పశువుల అక్రమ రవాణాకు అడ్డేలేకుండా పోతోంది.

కలెక్టర్, ఎస్పీ స్పందించాలి



జిల్లాల్లో పశువుల సంతల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ స్పందించాలి. అప్పుడు కొన్ని నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అడ్డాపుశీల, మరిపవలస, కోట్టకి ప్రాంతాల్లో వాటిని స్టాక్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. మూగజీవాలని చూడకుండా ఒక్కో వాహనంలో 10 వరకు కుక్కి రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

–బోటు రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ సభ్యుడు. పార్వతీపురం



బొలెరో వాహనంలో పశువులను బలవంతంగా ఎక్కిస్తున్న వ్యాపారులు

వాహనాల్లో కుక్కి..

పశువుల తరలింపులో ఆయా జంతువుల ఆకారాలను బట్టి వాహనాలను వినియోగించాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా జిల్లా నుంచి పశువులను తరలించే వ్యాపారులు అనుసరిస్తున్నారు. ఒకే దాహనంలో పదుల సంఖ్యలో పశువులను కుక్కి ఎక్కిస్తున్నారు. ఒక పెద్ద వాహనంలో ఎనిమిది పశువులు పట్టాల్సిన చోట 30 నుంచి 45 పశువులను ఎక్కిస్తున్నారు. రెండు మూడు పశువులు పట్టే టాటా ఏస్, బొలెరో వాహనంలో 8 నుంచి 10 వరకూ ఎక్కిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా చూడకుండా అన్ని పశువులను ఒకే వాహనంలో తరలిస్తున్నారు.

ఆరు నెలలుగా ఎవరికీ సర్టిఫికెట్ ఇవ్వలేదు..

గత ఆరు నెలలుగా ఇంతవరకూ ఎవరికీ పశువుల రవాణాకు సంబంధించి ఎటువంటి ధ్రువీకరణ పత్రమూ ఇవ్వలేదు. పశువుల రవాణాలో ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. వాటిలో పశువుల ఆరోగ్యంపై పశువైద్యుడిగా నేనివ్వాల్సిన ధ్రువీకరణ ఒకటి. ఈ పత్రం లేకుండా పశువులు తరలించడం చట్టరీత్యా నేరం. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ శివ్వాల మన్మథరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి, పార్వతీపురం మన్యం

చేపల ఉత్పత్తిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో చేపల పెంపకందారులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి పలు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై శిక్షణ తరగతుల కార్యక్రమంలో కలెక్టర్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చేపల సంపద అభివృద్ధి జరగాలని, మత్స్య సంపద ద్వారా సంవత్సరానికి కేవలం రూ.194 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరుతోందన్నారు. చేపల పెంపకంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 96 వేల మంది ఆధారపడుతున్నారని, చేపల పెంపకంపై మత్స్యకారుల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్యకు సూచించారు. జిల్లాలో ఉన్న పంచాయతీల్లో సుమారు 1800 చెరువులు ఉన్నాయని వాటిని చేపల పెంపకందారులు సద్వినియోగం చేసుకుని, చేపల పెంపకం పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త, ఫిషరీస్ స్టేట్ కో ఆర్డినేటర్ కె.గంగాధర్, డీఆర్‌డీఏ ఏపీఎం కె.భారతి, స్వచ్ఛ సుందర పార్వతీపురం ట్రస్ట్ సభ్యులు పద్మజ, పునర్వి ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ సీఈఓ హేమంత్, ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘ వైస్‌ఛైర్మన్ దాసరి లక్ష్మణ్, ఎఫ్‌డీఓలు, మత్స్యకార సంఘం డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ

● ఎస్పీ వకుల్ జిందాల్

సంతకవిటి: స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ముందుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ వకుల్ జిందాల్‌కు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్ఐ,ఆర్ గోపాలరావులు బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ సంతకవిటి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులు, పోలీస్ సిబ్బందితో సమావేశమై వారికి దత్తతగా అప్పగించిన గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు భూ తగాదాలు, గొడవలు వివిధ రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల పేర్లు గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందజేయాలని సూచించారు. ప్రతి వారం విధిగా దత్తత గ్రామాలను పోలీసులు సందర్శించాలని, ప్రజలకు సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.



మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సంకల్పంపై అవగాహన కల్పించాలి

గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలు, విద్యార్థులకు 'సంకల్పం' కార్యక్రమంతో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానిక వ్యాపారులు, ప్రజలు, ఎంఎస్‌పీల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూమ్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయిపై ఎక్కువ ఫోకస్ చేశామని గడిచిన 5 నెలల్లో 200 మందిని జిల్లాలో అరెస్ట్ చేశామని తెలిపారు. గంజాయి పట్టుబడితే అది ఎక్కడ పండింది? ఎక్కడి నుంచి రవాణా జరుగుతోంది? ఎవరు అమ్మారు, ఎవరు కొన్నారు అనే విషయాలపై ఎక్కువ దృష్టి సారించామన్నారు. కొత్తగా 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజు 10 చోట్ల జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు.



ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వైఎస్సార్ సీపీలో నూతన నియామకాలు

విజయనగరం: సంస్థాగతంగా పార్టీ బలోపేతంలో భాగంగా వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పరంగా నూతన నియమాకాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో పలు నియోజకవర్గాలకు సంబంధించి నాయకులకు నూతనంగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.మురళీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ అన్వర్ బాషాను నియమించారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పబ్లిసిటీ వింగ్ ప్రెసిడెంట్‌గా వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బూత్ కమిటీల అధ్యక్షుడిగా బూర్లె నరేష్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి ,రైతు విభాగం అధ్యక్షుడిగా మంత్రి అప్పలనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పీరుబండి జైహింద్ కుమార్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా వేమలి ముత్యాల నాయుడును నియమించారు. రాజాం నియోజకవర్గానికి సంబంధించి వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టర్ బలివాడ నరేంద్రకుమార్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎలకల వాసునాయుడు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా గంధవరపు హేమంత్‌కుమార్‌లను నియమించారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి మహిళా విభాగం అధ్యక్షురాలిగా గదల సత్యలత, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కేదారిశెట్టి సీతారామ్మూర్తి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎ.నాగవెంకట అంజనీకుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా దవడ కొండబాబు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా విన్నకోట శివప్రసాద్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారంతా జిల్లా పార్టీకి ఆయా విభాగాల అనుబంధ సంఘాలకు అధ్యక్షులుగా వ్యవహరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాకు..

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ షఫీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎస్. శ్రీనివాసనావును నియమించారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతులు



మెయిన్‌రోడ్డులో తీసిన గుంతలు పూడుస్తూ చేస్తున్న మరమ్మతులు

సాలూరు: మున్సిపాలిటీలో రోడ్ల మరమ్మత్తుతు చేపడుతున్నామని తెలిపి రోడ్లు తవ్వేసి వదిలేయడంపై 'తవ్వేసి వదిలేశారు' శీర్షికన ఈ నెల 17న సాక్షిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు తవ్వేసిన రోడ్లను కప్పుతూ మరమ్మతులు చేపట్టారు. అయితే ఓ వైపు మరమ్మతులు చేపడుతుండగా మరోవైపు చినుకులు పడుతున్న నేపథ్యంలో ఈ మరమ్మతుల రోడ్లు ఎంతవరకు నిలుస్తాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కిర్రాక్ ఫీచర్లతో వీవో ఎక్స్200 సిరీస్ విడుదల



వీవో ఎక్స్ 200 సిరీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

డాబాగార్డెన్స్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెల్ పాయింట్ ఇండియా వీవో ఎక్స్200 సిరీస్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా ఈ మొబైల్ ఫోన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏ కంపెనీ కొత్త మొబైల్ ఫోన్లను విడుదల చేసినా అవి ముందుగా సెల్‌పాయింట్‌లోనే అందుబాటులోకి వస్తాయన్నారు. నగరంలో సెల్‌పాయింట్ సెల్‌ఫోన్లకు అడ్డాగా మారిందని, వీవో ఎక్స్ 200 సిరీస్ మంచి ఫీచర్లతో మార్కెట్లోకి విడుదలైందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సిరీస్‌ను రూపొందించారన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సెల్‌పాయింట్ అధినేతను ఆయన అభినందించారు. చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 స్టోర్లకు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. వీవో ఎక్స్200 సిరీస్‌లో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని, ముఖ్యంగా కెమెరా, బ్యాటరీ, డిస్‌ప్లే వంటి వాటిపై కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. వీవో ఎక్స్ 200 సిరీస్ కొనుగోలుపై ఉచితంగా హ్యాపీ పోలా 100 వాట్స్ సౌండ్‌బార్, వీవో బడ్స్ టీడబ్ల్యూఎస్ 3ఈ ఏఎన్‌సీ అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని ఉత్పత్తులపై రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, శాంసంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోనీ, హైయర్, ఏసర్ వంటి టాప్ బ్రాండ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్, యాక్సెరీస్‌పై 60 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు వివరించారు. సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, వీవో సంస్థ ప్రతినిధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలింపుపై గట్టి నిఘా



గంజాయి, నిందితులను చూపిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు, సిబ్బంది

● డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ తరలింపుపై గట్టి నిఘా పెట్టామని డీఎస్పీ పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి తరలింపు ముఠాను పట్టుకోవడంలో మండలాల ఎస్సైలు, సిబ్బంది చాకచక్యాన్ని కొనియాడారు. ఒడిశాలోని పొట్టంగికి చెందిన ఓ మైనర్‌ను, కొరాపుట్‌లోని పొండేల్‌కు చెందిన చందన్ అద్కాటియా, హర్యానాలోని గోధికి చెందిన వీరేంద్ర సింగ్, రాజ్‌పుత్‌కు చెందిన సునీల్ రాణాలను గంజాయి అక్రమ రవాణా కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.91వేల విలువైన 18.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసును నమోదుచేయడానికి, నిందితులను పట్టుకోవడంలో బాడంగి, రామభద్రపురం ఎస్సైలు తారకేశ్వర రావు, వెలమల ప్రసాదరావు, రామభద్రపురం స్టేషన్‌కు చెందిన ఇద్దరు పీసీల కృషి ఉందని అభినందించారు. రూరల్ సీఐ నారాయణ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.